# సింగిల్ పేజీ కథలు

**'సిరికిం జెప్పక' ఆపదలో చిక్కుకున్న గజేంద్రుడిని రక్షించడానికి హడావుడిగా బయల్దేరిన విష్ణుమూర్తి మల్లే దిగ్గున లేచాడు గంగరాజు.**

చేతిలోని పేకముక్కల్ని క్రిందపడేసి వెళ్ళిపోయాడు. పేకాటలో తల మునకలై ఉన్న అతనిని మిత్రబృందమంతా ఊహించని ఈ పరిణామానికి బిత్తరపోయి చూసారు.

"ఏం జరిగింది?"

"ఏదో జరిగింది!"

"సెల్‌ఫోన్ మోగింది. ఎవరితోనో మాట్లాడాడు. అమాంతం లేచి వెళ్ళిపోయాడు"

"ఏం కష్టమొచ్చిందో? పదండి మనమూ వెళదాం" అంటూ అతని వెనుకే బయల్దేరారు మిత్రులు.

టాక్సీ రోడ్డు మీద వేగంగా పరుగులు తీస్తోంది. అందులో కూర్చున్న గంగరాజు మనసు అంతకన్నా వేగంగా పరిగెడుతోంది.

'రక్షించాలి. అతన్నెలాగైనా రక్షించి తీరాలి' అని మనసులో పదే పదే అనుకోసాగాడు.

వెనక మరో టాక్సీలో అతని పేకాట మిత్రులు కూడా టెన్షన్‌గా ఉన్నారు. మాట వరసకైనా ఏమీ చెప్పకుండా ఉన్నఫళంగా లేచి పరుగులు తీసాడూ అంటే ఏదో సీరియస్ విషయమే అయ్యుంటుందని అనుకున్నారు వాళ్ళు. అదేమిటో తెలుసుకోవాలని వాళ్ళకీ కుతూహలంగానే ఉంది.

కాస్సేపటికి గంగరాజు కూర్చున్న టాక్సీ ఊరికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న కొండమీదికి వెళ్ళి ఆగింది. అతని మిత్రులు ప్రయాణిస్తున్న టాక్సీ కూడా వెనకే వచ్చి ఆగింది. హడావుడిగా దిగారంతా.

కొద్దిదూరంలో జనం గుమిగూడి ఉన్నారు. ఒక కారు రోడ్డు పక్కనున్న చెట్టుకి ఢీకొని లోయలోకి జారి పడిపోయి ఉంది.

"అందరూ క్షేమమే కదా?" అక్కడున్నవారి నుద్దేశించి అడిగాడు గంగరాజు. ఆ మాటకి అందరి దృష్టి అతని మీదకి మళ్ళింది.

"ఎలాగో కష్టపడి అందరినీ రక్షించగలిగాము. ఒక్క వ్యక్తి మాత్రం అదిగో ఆ బండరాయి దిగువకి జారిపోయాడు. అక్కడికి వెళ్ళడం మాత్రం ఎవరితరం కావట్లేదు" అన్నాడొక వ్యక్తి.

గంగరాజు వింటున్నట్టు తలాడించాడు.

"నా పేరు గంగరాజు. మీలో ఎవరో నా సెల్‌కి ఫోన్ చేసారు" అంటూ తనని తాను పరిచయం చేసుకున్నాడు.

"నేనే ఫోన్ చేసింది. ఆ లోయలోకి దొర్లిపోయిన వ్యక్తి తాలూకు సెల్‌ఫోన్ దొరికింది. అందులో లేటెస్ట్‌గా మాట్లాడిన మీ నెంబరుంది. అందుకే మీకు ఫోన్ చేసాము" అన్నాడతను.

ఆ మాట వినగానే గంగరాజు ఖిన్నుడయ్యాడు.

"అయితే ఆ లోయలో పడిపోయినవాడు సుధాకరే. సందేహం లేదు. అతన్నెలాగయినా రక్షించాలి" అంటూ ముందుకు ఉరికాడు.

## సాహసి

అతని సాహసం చూసి అందరూ అదిరిపడ్డారు. అతన్ని వారించబోయారు. అయినా ఫలితం లేకపోయింది.

లోయలోకి వడివడిగా దిగుతూ జారిపడిపోకుండా అతి జాగ్రత్తగా బ్యాలెన్స్ కాసుకుంటూ దిగుతున్నాడు.

అక్కడున్నవారంతా ముఖ ముఖాలు చూసుకున్నారు. వాళ్ళే కాదు, గంగరాజు పేకాట మిత్రులు కూడా అయోమయంగా ఒకరినొకరు చూసుకున్నారు. తాము రోజూ చూసే గంగరాజేనా యితను? 'ఇంత తెగువ, సాహసం ఎక్కడినుంచి వచ్చాయబ్బా' అనుకున్నారంతా.

"ప్రమాదంలో చిక్కుకున్నవాడు అతని బంధువా?" అని అడిగాడొకతను. గంగరాజు మిత్రులు తల అడ్డంగా ఊపారు.

"పోనీ క్లోజ్ ఫ్రెండా?"

"ఊహు" మళ్ళీ అడ్డంగా ఊపారు.

"మరెందుకు అంత సాహసానికి పూనుకున్నట్టు?" ఇంకొకరెవరో అడిగారు.

"ఏమో అదే మాకూ అర్థం కావట్లేదు" అన్నారు వాళ్ళు.

క్రమక్రమంగా అందరిలోనూ కుతూహలం మొదలైంది. "బంధువు కాక, స్నేహితుడు కాక ప్రాణాలకు తెగించి మరీ కాపాడడానికి పూనుకోవాల్సినంత అవసరమేమొచ్చిందో" అని ఆలోచించసాగారందరూ.

కాస్సేపటికి గాయాలతో కదలలేని పరిస్థితిలో ఉన్న సుధాకర్‌ని భుజాన వేసుకొని అంగుళం అంగుళం అతి జాగ్రత్తగా కదులుతూ పైకి పాక్కుంటూ వస్తున్న గంగరాజుని చూసి అందరి కళ్ళల్లోను ఆనందం మెరిసింది. నమ్మలేనట్టు చూసారంతా. పట్టుజారిపోతున్న కాళ్ళు, చేతుల్ని అదుపులోకి తెచ్చుకుంటూ అతి జాగ్రత్తగా పైకి వస్తున్నాడతను. ఏమాత్రం జారిపడ్డా శాల్తీ గల్లంతు అన్న సంగతి అక్కడున్న అందరికీ తెలుసు.

అతను పైకి చేరుకోడానికి పట్టే ముప్పావుగంట సమయంలోనూ అక్కడున్నవాళ్ళు తమ మెదళ్ళకు పదును పెట్టి తీవ్రంగా ఆలోచించసాగారు.

"సాహసమే అతని ఊపిరి అయ్యుంటుంది. కాకపోతే అది ప్రదర్శించే అవకాశం దొరకడం మాత్రం ఇదే మొదటిసారి అయ్యుండాలి" అన్నాడొకడు.

"అలాగే ఎందుకనుకోవాలి? అతనేదో మర్డర్ కేసులో అన్యాయంగా ఇరుక్కొని ఉంటాడు. అతన్నా కేసు నుంచి బయట పడేయగల ఏకైక సాక్షి ఆ సుధాకర్ అయి ఉంటాడు. అతను చనిపోతే ఇతనికి ఉరిశిక్ష ఖాయం కాబట్టి ప్రాణాలకు తెగించి కాపాడుతున్నాడేమో" అంటూ తన సినిమా కథల ప్రతిభను బయటపెట్టాడొక కల్పనికుడు.

ఇలా ఎవరి ఊహాగానాల్లో వాళ్ళుండగా, చివరికెలాగైతేనేం అతను సుధాకర్‌ని సురక్షితంగా పైకి తీసుకు రాగలిగేడు.

కొందరు గాయపడిన సుధాకర్‌ని పడుకోబెట్టి సపర్యలు చేయడం మొదలుపెట్టారు. మరికొందరు గంగరాజు చుట్టూ చేరి ఆరాధనగా చూడసాగారు.

"మీలాంటి వ్యక్తుల్ని సినిమాల్లోను, నవలల్లోనూ మాత్రమే చూడగలుగుతాము. మీరు రియల్ లైఫ్ హీరో" అంటూ పొగిడాడొకడు.

"ఇలా కాపాడడం మీకు అలవాటా? లేక ఇదే మొదటిసారా?" అంటూ ప్రశ్నించాడింకొకడు.

గంగరాజు ఇవేమీ పట్టించుకునే పరిస్థితిలో లేడు. ఒంటికి అంటిన దుమ్ముని దులుపుకుంటూ సుధాకర్‌ని కుదిపాడు.

నిశ్శబ్దాన్ని చీల్చుతూ సుధాకర్‌తో అన్నాడు గంగరాజు.

"ఇదే ఆఖరిసారి చెప్పడం. ఏరోజు ఎలా ఉంటుందో, ఇప్పుడు చూసావుగా ఏమయిందో. మొన్న పేకాటలో బకాయిపడ్డ నా డబ్బు అర్జంటుగా తీర్చెయ్. వారం రోజులు టైమిస్తున్నాను" అని చెప్పి ఎంత వేగంగా వచ్చాడో అంతే వేగంగా వెళ్ళిపోయాడు.

అక్కడున్న అందరి ముఖాల్లోను కత్తివాటుకు నెత్తురు చుక్కలేదు. సాహసంలోని మర్మమేమిటో అప్పుడర్థమైంది వాళ్ళకి.

'ఔరా' అని ముక్కున వేలేసుకుని దుమ్మురేపుకుంటూ పోతున్న టాక్సీ వేపే చూస్తూ ఉండిపోయారంతా!

**-వనుపులేటి తాతారావు (భువనేశ్వర్)**